**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** రైసుమిల్లుల్లో ధాన్యం పక్కదారి పడుతున్నట్లు వరుస తనిఖీల్లో వెలుగుచూస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మిల్లుల్లో తనిఖీలు, దాడులు కొనసాగుతుండగా.. ఆయా మిల్లులకు కేటాయించిన ధాన్యం పరిమాణానికి, అక్కడ వాస్తవంగా ఉన్న నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. దీంతో రూ.కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2022–23లో టెండర్ల ద్వారా మిల్లులకు కేటాయించిన ధాన్యంలో కొంత ఇప్పటికీ మిల్లుల్లోనే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తాజాగా తాడూరులోని శ్రీలక్ష్మి నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లులో రూ.కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వేలం ధాన్యం లేదా దానికి సంబంధించిన సొమ్మును ప్రభుత్వానికి చెల్లించేందుకు మిల్లర్లకు పలుమార్లు గడువులు ఇచ్చినా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. టెండర్ ధాన్యానికి సంబంధించి సుమారు రూ.160 కోట్ల వరకు సొమ్ము రికవరీ కావాల్సి ఉండగా.. డిఫాల్ట్ అయిన మిల్లుల నుంచి కూడా పెద్ద మొత్తంలో బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు మిల్లులపై దాడులు, తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు వంగూరు మండలంలోని జోగులాంబ రైస్‌మిల్లుపై విజిలెన్స్ అధికారులు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. సదరు మిల్లు యజమాని ప్రభుత్వానికి ఇప్పటికే రూ.6 కోట్లకు పైగా బకాయి ఉన్నట్లు సమాచారం. అయితే ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మరాడించేందుకు మిల్లర్లకు కేటాయిస్తుంది. నిర్దేశిత గడువులోగా మరాడించిన బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా పలు మిల్లులు ధాన్యాన్ని సకాలంలో మరాడించకపోవడంతోపాటు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలను అరికట్టేందుకు బ్యాంకు గ్యారంటీలు, సొంత పూచీకత్తు వంటి నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ కొందరు మిల్లర్లు వాటిని ఉల్లంఘించి ప్రభుత్వ ధాన్యాన్ని సొంత వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వచ్చే సీజన్ నుంచైనా ధాన్యం పక్కదారి పట్టకుండా కఠినమైన పర్యవేక్షణతోపాటు బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## కాలుష్య కోరల్లో ఉమ్మడి జిల్లా

- నానాటికీ పడిపోతున్న గాలి నాణ్యత
- ప్రజల్లో పెరుగుతున్న ఆందోళన
- చెట్ల నరికివేత, వ్యర్థాల దహనంతో ముప్పు




**ప్రజానావ, నల్గొండ:** ఉమ్మడి జిల్లాలో నానాటికీ క్షీణిస్తున్న గాలి నాణ్యత ప్రజలను కలవరపెడుతోంది. అభివృద్ధి పేరిట అడవులు, చెట్ల నరికివేతతోపాటు పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించక పోవడం, ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థాలు, పంట వ్యర్థాలను బహిరంగంగా తగలబెట్టడం వంటి కారణాలతో వాయు కాలుష్యం పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రజలతోపాటు అధికారులు కూడా పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా చర్యలు చేపట్టాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. గతేడాది వాయు కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా 64 లక్షల అకాల మరణాలు సంభవించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇళ్లలో ఏర్పడే వాయు కాలుష్యంతో మరో 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో సుమారు మూడు లక్షల మంది చిన్నారులు ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం, క్లైమెట్ అండ్ క్లీన్ ఎయిర్ కోయలిషన్ సంయుక్త నివేదిక పేర్కొంది. అదే ఏడాది 55 లక్షల కొత్త చిన్నారుల ఆస్తమా కేసులు నమోదయ్యాయని, సుమారు 20 లక్షల మతిమరుపు వ్యాధి కేసులతోపాటు గుండెపోటు, మధుమేహం, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి అనారోగ్య సమస్యలకు వాయు కాలుష్యం కారణమవుతోందని నివేదికలో పేర్కొన్నారు. కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణాను వినియోగించాలి. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతోపాటు వ్యర్థాలను బహిరంగంగా తగలబెట్టకుండా డంపింగ్ యార్డులకు తరలించాలి. అవసరమైన సందర్భాల్లో బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు ధరించడం, ఇళ్లలో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు ఇండోర్ మొక్కలను పెంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశ్రమలు సైతం కాలుష్య నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

## చోరీ ఘటనపై ఆలయ అధికారుల ఆరా



ప్రజానావ, మెదక్: శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ విజయరామారావు మంగళవారం పరిశీలించారు. ఆలయ నిర్వహణ తీరుతోపాటు ఆది వారం రాత్రి జరిగిన చోరీ ఘటనపై అర్చకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలయంలో భద్రతా చర్యలు పటిష్ఠంగా చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. ఆయన వెంట మెదక్ జిల్లా హుండీ పరిశీలకుడు (ఇన్‌స్పెక్టర్) వి.రంగారావు, ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ శర్మ తదితరులు ఉన్నారు.



## రక్తదానం.. మహత్తర మానవతా సేవ

- జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవ వారోత్సవాల్లో రక్తదాన శిబిరాలు

**ప్రజానావ, ఖమ్మం:** జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మం బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఖమ్మం మెడికల్ కాలేజీ, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల, కూసుమంచిలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో విద్యార్థులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రామారావు మాట్లాడుతూ రక్తదానం మహత్తరమైన మానవతా సేవ అని అన్నారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, రక్తహీనత, తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతోపాటు అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో ప్రవీణ, మెడికల్ సూపరింటెండెంట్ ఎం. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహారం వృథా.. ఆకలికి ద్రోహం

- విందులు, హోటళ్లలో కిలోల కొద్దీ ఆహారం వృథా
- మరోవైపు ఆకలి తీర్చుకునేందుకు పేదల అన్వేషణ
- స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

**ప్రజానావ, నల్గొండ:** మనిషి మనుగడకు గాలి, నీరు ఎంత అవసరమో ఆహారం కూడా అంతే అవసరం. అయితే ఒకవైపు కడుపునిండా తిండి కోసం పేదలు, అభాగ్యులు అన్వేషిస్తుండగా.. మరోవైపు శుభ, అశుభకార్యాలు, సమావేశాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో నిత్యం కిలోల కొద్దీ ఆహారం వృథాగా పడేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి ప్రధాన పట్టణాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. అంతర్జాతీయ ఆహార నష్టం, వృథా అవగాహన దినోత్సవం సందర్భంగా ఆహార వృథాపై అవగాహన పెంచాల్సిన అవసరం మరోసారి తెరపైకి వచ్చింది. ఆహార వృథాను అరికట్టేందుకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ధాన్యాల నిల్వకు అధునాతన గోదాములు, శీతల గిడ్డంగుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. విందుల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి



అవసరమైన వారికి అందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచే ప్లేటులో ఆహారాన్ని వదిలేయకుండా, అవసరమైనంత మాత్రమే తీసుకోవాలనే అలవాటును పెంపొందించాలి. ఉమ్మడి జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు, సేవా బృందాలు ఆహార వృథాను అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తున్నాయి. మిర్యాలగూడకు చెందిన ఫాతిమా ఎన్విరాన్‌మెంటల్ డెవలప్‌మెంట్ సొసైటీ, యాట్యూబర్ సజ్జు, అవిరెండ్ల సందీప్ మిత్రబృందాలు, నల్గొండకు చెందిన అమ్మ ఫౌండేషన్ రేఖ, ఆపద్బాంధవ ఫౌండేషన్ సంజు, చౌటుప్పల్‌కు చెందిన ఆయాన్ భార్గవ్ ట్రస్టు మురళి తదితరులు శుభకార్యాల్లో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంపిణీ చేస్తూ సేవలందిస్తున్నారు. దేశంలో ఒక్కో వ్యక్తి సగటున ఏటా 55 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో ఆహార వృథా అధికంగా ఉంటోంది. మరోవైపు సుమారు 14.3 శాతం మంది తగిన పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు పోషకాహార లోపం కూడా కారణమవుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇళ్లలో సుమారు 23 శాతం, రెస్టారెంట్లు, హోటళ్లలో 13 శాతం, శుభకార్యాల్లో ఏకంగా 35 శాతం వరకు ఆహారం వృథా అవుతున్నట్లు అంచనా. ఆహారం వృథాను అరికట్టి.. మిగిలిన ఆహారాన్ని ఆకలితో ఉన్నవారికి అందిస్తే ఒకవైపు వనరుల వృథాను తగ్గించడంతోపాటు మరోవైపు నిరుపేదల ఆకలి తీర్చినట్లవుతుంది.

# కుంటలపై కబ్జాదారుల కన్ను

- నర్సాపూర్‌లో ఆరు నీటి వనరులు.. రెండింటి జాడే లేదు
- ఎఫ్‌టీఎల్, బఫర్, కాలువలూ ఆక్రమణ
- చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజానావ, మెదక్:** రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న నర్సాపూర్‌లోని నీటి వనరులపై ఆక్రమార్కుల కన్ను పడింది. పట్టణంలో, పరిసర ప్రాంతాల్లో ఆరు కుంటలు ఉండగా.. ఇప్పటికే రెండు ఆక్రమణలతో కనుమరుగయ్యాయి. భూముల విలువ భారీగా పెరగడంతో కుంటలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థిరాస్తి వ్యాపారం పుంజుకోవడంతో కుంటల ఆయకట్టు భూములు వెంచర్లుగా మారుతున్నాయి. కుంటలకు అనుసంధానంగా ఉన్న పంట కాలువలనూ ఆక్రమణదారులు వదలడం లేదు. స్థానిక కోమటికుంట కట్టతోపాటు పంట కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ బఫర్ ప్రాంతం సైతం అన్యాక్రాంతమవుతోంది. మెదక్ మార్గంలోని అల్లమోని కుంట కొంత మేర కబ్జాకు గురికాగా.. ఇక్కడి నుంచి మట్టిని అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



కుంట కట్ట, అలుగులు కూడా అన్యాక్రాంతమయ్యాయి. కొందరు పైప్‌లైన్ వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఏదులకుంట, సీతారాంపూర్ సమీపంలోని ఎర్రకుంట పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. నీటి వనరుల పరిరక్షణకు సంర క్షణ కమిటీలను ఏర్పాటు చేసి ఆక్రమణలను అడ్డుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు. ఆక్రమణ లు జరిగినా వాటిని తొలిదశలోనే గుర్తించి తొలగించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని పదేళ్ల కిందటే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయినా ఇప్పటివరకు కమిటీల ఏర్పాటు లో ముందడుగు పడలేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ ఏఈ సునీత దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంగారెడ్డి మార్గంలోని కోరేటికుంట పూర్తిగా ఆక్రమణకు గురై ప్రస్తుతం కట్ట మాత్రమే మిగిలింది. నలువైపులా కబ్జాలు కొనసాగడంతో కుంట విస్తీర్ణం కనుమరుగైన పరిస్థితి నెలకొంది. ఇక్కడ గజం భూమి కనీసం రూ.లక్ష వరకు పలుకుతుండటంతో పలువురు ఆక్రమించి నిర్మాణాలు సైతం చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఆవరణలోని కొత్తకుంటను కూడా ఆక్రమించేందుకు కొందరు మట్టితో పూడ్చివేశారు. ముందు భాగంలో దుకాణాలు వెలిసి వాటిని అద్దెకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. బస్టాండ్ నిర్మాణం కోసం ఏళ్ల క్రితం కేటాయించిన ఐదెకరాల భూమిలోనే ఈ కొత్తకుంట కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. నీటి వనరులు పూర్తిగా కనుమరుగైతే భవిష్యత్తులో వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, పట్టణ వరదల నియంత్రణపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## మృత్యువుతో పోరాడుతున్న బాలుడు

- పందిరి తొలగిస్తుండగా ప్రమాదం
- తలకు తీవ్ర గాయం
- వైద్యం కోసం రూ.6 లక్షలు అవసరం
- దాతల సాయం కోసం కుటుంబం వేడుకోలు

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** అనుకోని ప్రమాదం ఓ బాలుడిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టింది. మృత్యువుతో పోరాడుతున్న తమ కుమారుడికి ప్రాణదానం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ప్రమాదవ శాత్తు తీవ్రంగా గాయపడిన బాలుడు ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అశ్వాపురానికి చెందిన సాయిని శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కుమారుడు రోహిత్ భద్రాచలంలోని తాతయ్య, అమ్మమ్మల వద్ద ఉంటూ ఆదర్శనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల వినాయకుడి మండపం వద్ద పందిరిని తొలగించే క్రమంలో జరిగిన ప్రమాదంలో రోహిత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎడమ కంటి పైభాగం నుంచి తల వరకు పురైకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. భద్రాచలంలోని కాలనీవాసులు, ఇతర దాతలు అందించిన ఆర్థిక సాయంతో రోహిత్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి వైద్య ఖర్చులు సుమారు రూ.6 లక్షల వరకు అవుతాయని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత మొత్తం భరించే ఆర్థిక స్తోమత తమకు లేదని బాలుడి తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరవుతోంది. ప్రభుత్వం స్పందించి రోహిత్ చికిత్సకు ఆర్థిక సాయం అందించి తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని ఆమె వేడుకుంటున్నారు.





## ఏ వార్డు ఎక్కడో తెలియదు

- ఏదులాపురం మున్సిపాలిటీలో సూచిక బోర్డులు కరువు
- ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి
- పాలకమండలి ఏర్పడినా పట్టించుకోని వైనం

**ప్రజానావ, ఖమ్మం:** దాదాపు ఏడాదిన్నర క్రితం పురుడు పోసుకున్న ఏదులాపురం మున్సిపాలిటీలో ఏ వార్డు ఎంతవరకు విస్తరించి ఉందో తెలిపే స్పష్ట మైన సూచికలు లేక ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పాలనా సౌలభ్యం కోసం జనాభా ప్రాతిపదికన వార్డులను విభజించిన అధికారులు వాటి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో మాత్రం కాలయాపన చేస్తున్నారు. మున్సిపాలిటీ పాలకమం డలి కొలువుదీరి ఆరు నెలలు గడిచినా ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం గ్రామీణ మండలంలోని 12 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ 2025 జనవరి 25న ఏదులాపురం మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా మున్సిపా లిటీని 32 వార్డులుగా విభజించారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 150 పేర్లతో కాలనీలు ఉన్నట్లు అధికారిక అంచనా ఉన్నప్పటికీ ఇప్పటివరకు వార్డుల వారీగా గుర్తింపు బోర్డులు ఏర్పాటు కాలేదు. పలుచోట్ల ఇప్పటికీ గ్రామీణ మండలం పేరుతోనే కాలనీల బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టే సమయంలో సిబ్బందికి వార్డుల పరిధి తెలియక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో డెలివరీ బాయ్స్‌తోపాటు ర్యాపిడో, ఊబర్ వంటి ఆటో సర్వీసుల వారు గమ్య స్థానాలకు చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఏ డివిజన్ పరిధి ఎంతవరకు ఉందో స్పష్టత లేక కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు సైతం కొన్ని సందర్భాల్లో తికమకపడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రతి కాలనీ ప్రవేశ ద్వారం వద్ద స్పష్టంగా కనిపించేలా వార్డు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పెద్ద కాలనీలు, లేఅవుట్ల వద్ద ఆయా ప్రాంతాలను సూచించే మ్యాప్‌ల ను ఏర్పాటు చేసి, ఏ వార్డు పరిధిలోకి ఏ కాలనీ వస్తుందో స్పష్టంగా పేర్కొనాలని సూచిస్తున్నారు. అలాగే ఇంటర్నెట్‌లోని మ్యాప్ వెబ్‌సైట్లను అప్‌డేట్ చేసి వార్డుల పరిధి, కాలనీలకు సంబంధించిన స్పష్టమైన వివరాలను పుర అధికారులు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్త తప్పనిసరి

- విద్యార్థులకు ఆర్‌బీఐ అవగాహన

**ప్రజానావ, నల్లగొండ:** ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాల నివారణ, ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ, నల్లగొండ జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నాగార్జున ప్రభుత్వ కళాశాలలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఏటీఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్, ఫిషింగ్, మోసపూరిత పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రిటైల్ డైరెక్ట్ పథకం ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారులు రాజ్‌కుమార్ డాడ్గే, పిండి గణేష్ సాగర్, ఎస్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తూడి శ్రామిక్, కళాశాల ప్రిన్సిపాల్, సీఎఫ్ఎల్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# బీచుపల్లిలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఎప్పుడో?

- రెండేళ్లుగా పరిశీలనలకే పరిమితం
- రూ.60 కోట్ల ప్రాజెక్టుపై రైతుల్లో ఆందోళన
- తాజాగా లేఅవుట్ పరిశీలించిన అధికారులు

**ప్రజానావ, గద్వాల:** ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నప్పటికీ గద్వాల–నారాయణపేట జిల్లాల రైతులకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 34 వేల ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్ సాగులో ఉండగా.. ప్రస్తుతం గెలల టన్ను ధర రూ.23 వేల వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో గద్వాల–నారాయణపేట జిల్లాలకు కలిపి బీచుపల్లి వద్ద రోజుకు 365 టన్నుల గెలలను క్రషింగ్ చేసే సామర్థ్యంతో పరిశ్రమ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.60 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. అయితే రెండేళ్లుగా అధికారులు పరిశీలనలు చేయడానికే పరిమితమవుతున్నారని, నిర్మాణ



పనులు మాత్రం ప్రారంభం కావడం లేదని ఆయిల్‌పామ్ సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత జనవరిలో పరిశ్రమ పనులు ప్రారంభించేం దుకు ఆయిల్‌ఫెడ్ అధికారులు హడావుడి చేసినప్పటికీ ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. క్రషింగ్ యూనిట్‌కు అవసరమైన నీటిని కృష్ణానది నుంచి వినియోగించుకునేందుకు అనుమతులు కూడా లభించాయి. అయినప్పటికీ నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా వారం క్రితం పరిశ్రమ నిర్మాణానికి సంబంధించిన లేఅవుట్‌ను అధికారులు పరిశీలించడం మరోసారి ఆశలు రేకెత్తించింది. తొలి దశలో నాటిన ఆయిల్ పామ్ తోటల నుంచి 2025–26లో రైతులు సుమారు రూ.15 కోట్ల విలువైన గెలలను ఆయిల్‌ఫెడ్‌కు విక్రయించా రు. ప్రస్తుతం నెలలో నాలుగు రోజులు విడతల వారీగా కొనుగోలు కేంద్రాల్లో గెలలను సేకరిస్తున్నారు. బీచుపల్లి వద్ద క్రషింగ్ పరిశ్రమ అందుబాటులోకి వస్తే ఆయిల్‌పామ్ సాగు మరింత విస్తరించే అవకాశం ఉండటంతోపాటు రైతులకు రవాణా ఇబ్బందులు కూడా తగ్గనున్నాయి. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ప్రతి వారం సేకరించే గెలలను ఒకచోట చేర్చి సిద్దిపేట, అశ్వారావుపేటలోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఇందుకోసం ఆయిల్‌ఫెడ్ టెండర్లు పిలిచి రవాణా ఆపరేటర్లకు బాధ్యతలు అప్పగిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా ఉన్న కొనుగోలు కేంద్రాలకు ప్రతి నెలా సుమారు 10 వేల టన్నుల వరకు గెలలు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్థానికంగానే క్రషింగ్ యూనిట్ ఏర్పాటైతే రవాణా వ్యయం, సమయం తగ్గడంతోపాటు రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని వారు ఆశిస్తున్నారు.



## చేయి తడిపితేనే పనులు.. లేదంటే కొర్రీలు

**ఇల్లు కట్టాలంటే ముడుపులు చెల్లించాల్సిందేనా?**

**ప్రజానావ, కామారెడ్డి:** పట్టణాల్లో ఇళ్ల నిర్మాణ అనుమతుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిచ్కుంద పట్టణంలోని రెండో వార్డులో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా అక్రమంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడని కౌన్సిలర్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. అనంతరం పుర సిబ్బందిలో కొందరు డబ్బులు తీసుకుని నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్న ఆరోపణలు రావడంతో కౌన్సిలర్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు దృష్టికి తీసుకెళ్లారు. బిచ్కుందలో ఇటీవల నిర్వహించిన ఓ సమావేశంలో ముడుపుల వ్యవహారంపై ఎమ్మెల్యే పుర అధికారిపై ప్రజల సమక్షంలోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత సదరు అధికారి దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. పుర ఉద్యోగులు మ్యుటేషన్ కోసం స్థలం విస్తీర్ణాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ముడుపులు తీసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బాన్సువాడ పట్టణంలో ఎక్కడైనా ఇంటి నిర్మాణం ప్రారంభమైతే కొందరు ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు అక్కడికి చేరుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేయి తడిపితేనే నిర్మాణ పనులు సాగనిస్తున్నారని, లేదంటే వివిధ కారణాలతో అడ్డుకుంటున్నారని పలువురు నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సాయికృపనగర్, తహసీల్దార్ కార్యాలయం ప్రధాన రోడ్డు, పార్కు రోడ్డు, పాత బాన్సువాడ రోడ్డు ప్రాంతాల్లో కొందరు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై ఆయా వార్డులకు చెందిన ప్రజాప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే డబ్బులు చెల్లించిన తర్వాత పనులకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఎల్లారెడ్డి పట్టణంలోనూ ఇళ్ల నిర్మాణాల విషయంలో ఇదే తరహా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఇంటి యజమాని నుంచి రూ.50 వేల వరకు, ఇంటిని నిర్మించు కుంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి నుంచి మరో ప్రజాప్రతినిధి రూ.లక్ష వరకు ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. తాను ప్రభుత్వ ఉద్యోగినని చెప్పినా డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వని నిర్మాణదారుల వద్దకు కొందరు ప్రజాప్రతినిధులు అధికారులను పంపించి, వివిధ కొర్రీలు పెట్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఓ ప్రజాప్రతినిధి పుర ఉద్యోగిని పంపించి ఇదే తరహాలో ఓ నిర్మాణదారు నుంచి రూ.35 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇళ్ల నిర్మాణ అనుమతులు, మ్యుటేషన్ల విషయంలో జరుగుతున్న ఈ వ్యవహారాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ముగ్గురు విద్యార్థినులు

**అండర్–14 విభాగంలో ప్రతిభ చాటిన పోతంగల్ కలాన్ పాఠశాల విద్యార్థినులు**



**ప్రజానావ, ఎల్లారెడ్డి:** గాంధారి మండలం పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నాగరాజు తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలికల అండర్–14 రగ్బీ ఎంపిక పోటీల్లో కె. రేఖ, సాత్విక, ముస్కాన్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగారావు మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినుల ప్రతిభను అభినందిస్తూ ఉపాధ్యాయ బృందంతో పాటు గ్రామ సర్పంచ్ అనుశ్రీ, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## జోనల్ స్థాయి జూడో ఎంపిక పోటీలు

- నాలుగు జిల్లాల క్రీడాకారుల ఉత్సాహభరిత పాల్గొనడం
- ప్రతిభకు నిత్య సాధన కీలకం: అధికారులు



**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని జూడో హాలులో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్–14, అండర్–17 విభాగాల బాలబాలికల జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) జూడో ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో నిర్మల్, కుమురం భీమ్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారు లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి డీఈఓ మాధవి, పుర అధ్యక్షురాలు అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూడో క్రీడలో రాణించాలంటే క్రమశిక్షణతో ప్రతిరోజూ సాధన చేయాలని క్రీడాకారులకు సూచిం చారు. నిరంతర శ్రమ, సాధనతోనే పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి అల్లూరి దయానంద రెడ్డి, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆడే రామేశ్వర్, జూడో కోచ్ నంగానూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



## భూముల అవకతవకలపై కమిటీ సభ్యుడు ఐఏఎస్ సందీప్ కుమార్ ఝా సమీక్ష

**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం భూముల అవకతవకలపై కమిటీ సభ్యుడు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీవో నంబర్ 134 ప్రకారం భూములపై నియమించిన కమిటీ సభ్యుడు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లాలోని తహసీల్దార్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూములపై సమీక్షించి.. భూములు అవకతవకలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

## పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు

- భగ్గుమన్న నేతన్నలు, పోలీస్ స్టేషన్‌కు చేరిక
- బత్తుల శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజానావ, సిరిసిల్ల :** నేతన్నలను కించపరుస్తూ ఒక యూట్యూబ్ ఛానల్ లో కేటీఆర్ అనుచరుడు అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై సిరిసిల్లలో పద్మశాలి వర్గాలు భగ్గుమన్నాయి. పద్మశాలీ సమాజం, నేతన్నలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బత్తుల శ్రీనివాస్‌పై పద్మశాలీ సంఘాల నాయకులు, సమాజ ప్రతినిధులు మంగళవారం సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు పద్మశాలీ సమాజం మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో పద్మశాలీలు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బత్తుల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పద్మశాలీ సంఘాల నాయకులు పోలీసులను కోరారు. ఈ సందర్భంగా సమాజ ప్రతినిధులు మాట్లాడుతూ పద్మశాలీలు, నేతన్నల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

# మొరాయిస్తున్న బయోకెమికల్ ఎనలైజర్

- రోగులకు అవస్థలు
- టీ–హబ్‌లో కీలక పరీక్షలు బంద్
- ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న బాధితులు




**ప్రజానావ, మహబూబాబాద్:** మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రిలోని టీ–హబ్‌లో బయోకెమికల్ ఎనలైజర్ పరికరం తరచూ మొరాయిస్తుండటంతో రోగులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా జరగాల్సిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిలిచిపోవడంతో బాధితులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి వందల నుంచి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. టీ–హబ్‌లో రోజుకు సుమారు 800 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తుండగా, కాలేయం, కిడ్నీ, మధుమేహం, లిపిడ్ ప్రొఫైల్, కాల్షియం తదితర కీలక బయోకెమికల్ పరీక్షలు రోజుకు సుమారు 100 వరకు ఉంటాయి. కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసిన బయోకెమికల్ ఎనలైజర్ ఇటీవల తరచూ సాంకేతిక సమస్యలకు గురవుతుండటంతో ఈ పరీక్షలు నిలిచిపోతున్నాయి. పరికరానికి స్థానికంగా మరమ్మతులు చేసే అవకాశం లేకపోవడంతో హైదరాబాద్ నుంచి సాంకేతిక నిపుణులు వచ్చే వరకు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి టీ–హబ్‌కు తీసుకొచ్చే రక్త నమూనాల విశ్లేషణ కూడా దీనివల్ల నిలిచిపోతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందాల్సిన పరీక్షలను బయట ప్రైవేట్ ల్యాబ్‌లలో చేయించుకోవాల్సి రావడంతో ఒక్కో రోగి రూ.500 నుంచి రూ.1,000 వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇటీవల కొందరు రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించిన అనంతరం పరికరం పనిచేయకపోవడంతో మళ్లీ శాంపిల్స్ ఇవ్వాలని సిబ్బంది సూచించడంతో వారు ఆందోళనకు గురయ్యారు.

**అదనపు పరికరం అవసరం**

టీ–హబ్‌లో నిరంతరం 24 గంటలూ ఒకే పరికరంపై అధిక భారం పడుతుండటంతోనే తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. అదనంగా మరో బయోకెమికల్ ఎనలైజర్‌ను అందుబాటులో ఉంచితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావును సంప్రదించగా.. పరికరం మరమ్మతుల కోసం సాంకేతిక నిపుణులను పిలిపించామని, త్వరలోనే దాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.



## విద్య, వైద్య సేవలపై మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక ప్రతినిధి ఆరా

- ఏకలవ్య పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని సూచన

**ప్రజానావ, గాంధారి:** మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలను మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక ప్రతినిధి దేవేంద్ర కుమార్ సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలోని హాస్టల్ వసతి, తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రతను క్రమం తప్పకుండా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ రవీందర్ కుమార్‌కు సూచించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ నవ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం గాంధారి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన దేవేంద్ర కుమార్ ఆసుపత్రిలో అందుతున్న సేవలు, వైద్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రోగుల వార్డులను పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకట్, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ రేణుక చౌహన్, మండల అభివృద్ధి అధికారి రాజేశ్వర్, మండల విద్యాశాఖ అధికారి శ్రీహరితో పాటు పలువురు మండల స్థాయి అధికారులు ఉన్నారు.

## స్వచ్ఛతలోప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

- ప్లాస్టిక్ నిర్మూలనతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్
- సర్పంచ్ మిర్యాల్కర్ బాలాజీ

**ప్రజానావ, కోనరావుపేట :** స్వచ్ఛత హి సేవ–2026 కార్యక్రమంలో భాగంగా కోనరా వుపేట మం డలం ధర్మారం గ్రామంలోని ప్రాథమి కోన్నత పాఠశా లలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2026పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, జూట్ బ్యాగుల తయారీ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఘన వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహిం చడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో సర్పంచ్ మిర్యాల్కర్ బాలాజీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వా మ్యం అవసరమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి, పరిశుభ్రమైన పరిసరాలను కాపాడ టం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. స్వచ్ఛత ను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరిం చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయ తీ కార్యదర్శి రవి, ఉపాధ్యాయులు స్వప్న, కృపారాణి, పద్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## మల్కాపేట 9వ ప్యాకేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి

- ఎసంగిలో సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం
- బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ

**ప్రజానావ, కోనరావుపేట:** మల్కాపేట రిజర్వాయర్ పరిధిలోని 9వ ప్యాకేజీ పనులను తక్షణమే పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ కోనరావుపేట మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎసంగి (యాసంగి) సీజన్‌కు అవసరమైన సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. 2023లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని బాలాజీ ఆరోపించారు. కోనరావుపేట మండల పరిధిలో కాల్వల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీరు అందక ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. మల్కాపేట రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులతో పాటు కాల్వల నిర్మాణాలను వేగవంతం చేసి, రానున్న పంట కాలానికి రైతులకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, ఉపాధ్యక్షులు చింతల పరుశురాం, బూత్ అధ్యక్షులు పొన్నం మహేష్, పిల్లి వెంకట్, కాదర్ల వికాస్, యశోద రాజు, గుండా శ్రీకాంత్, సామల గణేష్, వాసాల అభినయ్, జెట్టి శేషు, వేముండ్ల సాగర్, తాండ్ర







# మేడారంలో సమ్మక్క-సారలమ్మకు నానీ పూజలు

- ది ప్యారడైజ్' విజయంతో వనదేవతల చెంతకు చిత్రబృందం
- నటుడు సంపూర్ణేష్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు

సినీ నటుడు నాని ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఇటీవల విడుదలైన ఆయన చిత్రం 'ది ప్యారడైజ్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో చిత్రబృందంతో కలిసి మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని గట్టమ్మ ఆలయం వద్ద ఆగి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క–సారలమ్మల గద్దెలను 'ది ప్యారడైజ్' చిత్రబృందం సందర్శించింది. కథానాయకుడు నానితో పాటు నటుడు సంపూర్ణేష్‌బాబు, చిత్రబృందానికి ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం నాని వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు చిత్రబృందానికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. నాని మేడారం వచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. తమ అభిమాన నటుడిని చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

– ప్రజానావ, ములుగు

# ప్రపంచానికి భారీ ఆహార సంక్షోభం ముప్పు

- ఎరువుల కొరత, ధాన్యం రవాణాకు ఆటంకాలు
- ఉక్రెయిన్, గల్ఫ్ యుద్ధాలతో గ్లోబల్ సౌత్‌పై తీవ్ర ప్రభావం: జైశంకర్



**న్యూయార్క్:** రాబోయే నెలల్లో ప్రపంచం భారీ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ హెచ్చరించారు. ఎరువుల కొరత, ధాన్యం రవాణాకు అంతరాయాలు, సూపర్ ఎల్ నినో ముప్పుతో పాటు ఉక్రెయిన్, గల్ఫ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. న్యూయార్క్‌లో ఆసియా సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండు యుద్ధాల కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంధన రంగంపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోందని, ప్రస్తుతం అంతర్జాతీయ ఇంధన మార్కెట్ తీవ్ర ఒత్తిడిలో ఉందని చెప్పారు. చమురు సరఫరాలను రాజకీయాలతో ముడిపెడితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని జైశంకర్ పేర్కొన్నారు. ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇది మరింత సమస్యలను సృష్టించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

# అమెరికాలో ఎస్సార్ గ్రూప్ భారీ పెట్టుబడులు

- రూ. విలువలో సుమారు రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడికి ఆసక్తి
- ఐయోవాలో భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు




**వాషింగ్టన్:** భారత బహుళజాతి సంస్థ ఎస్సార్ గ్రూప్ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. సుమారు 18 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ఎస్సార్ గ్రూప్ సిద్ధమవుతోందని, ఇందులో భాగంగా ఐయోవా రాష్ట్రంలో దాదాపు 15 బిలియన్ డాలర్లతో భారీ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఎస్సార్ గ్రూప్ యజమానులు రవి రుయా కుటుంబ సభ్యులతో పాటు ఎస్సార్ అమెరికా అనుబంధ సంస్థ మెసాబి మెటాలిక్స్ చైర్మన్ రివాంత్ రుయా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమెరికాలో సమగ్ర స్టీల్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయనున్న ఎస్సార్ గ్రూప్.. మిన్నెసోటాలో లభించే ఇనుప ఖనిజాన్ని తన కార్యకలాపాలకు వినియోగించుకోనుంది. అమెరికా చరిత్రలోనే ఇది అతిపెద్ద స్టీల్ కంపెనీగా అవతరించనుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పెట్టుబడిని తమ ప్రభుత్వం సాధించిన ఆర్థిక విజయంగా అభివర్ణించిన ఆయన, ఈ ప్రకటన చేయడం ఎంతో ఉత్సాహంగా ఉందన్నారు. 2030 నాటికి ఐయోవా ప్లాంట్‌లో స్టీల్ ఉత్పత్తి ప్రారంభం కానుండగా, ఏటా సుమారు కోటి టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. స్టీల్ ఉత్పత్తికి సంబంధించిన పూర్తి ప్రక్రియను అమెరికాలోనే నిర్వహించనున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. అమెరికా స్టీల్ దిగుమతులపై విధిస్తున్న 50 శాతం సుంకాన్ని తప్పించుకునేందుకే విదేశీ కంపెనీలు తమ ప్లాంట్లను అమెరికాలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు.

# సిమెంట్ ధరలకు మళ్లీ రెక్కలు

- అక్టోబర్‌లో బస్తాపై రూ.5 నుంచి రూ.20 వరకు పెంపు అవకాశం
- డిమాండ్ పుంజుకోవడం, డీలర్ల ఆమోదంపైనే ధరల పెరుగుదల

**న్యూఢిల్లీ:** సిమెంట్ ధరలు మరోసారి పెరిగే అవకాశం కనిపిస్తున్నది. అక్టోబర్‌లో కంపెనీలు ఒక్కో బస్తాపై రూ.5 నుంచి రూ.20 వరకు ధరలు పెంచే అవకాశముున్నదని సెంట్రమ్ బ్రోకింగ్ అంచనా వేసింది. ఇప్పటికే ఈ నెలలో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ధర రూ.7 మేర పెరిగి రూ.356కు చేరింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ భారతంలో బస్తాపై సుమారు రూ.11, పశ్చిమ భారతంలో రూ.9, మధ్య, తూర్పు, ఉత్తర భారతాల్లో రూ.5 చొప్పున ధరలు పెరిగే అవకాశం ఉన్నదని తెలిపింది. అయితే సిమెంట్ ధరల పెంపు ఎంతమేర అమలవుతుందన్నది డిమాండ్ పుంజుకోవడం, ధరల పెంపునకు డీలర్లు అంగీకరించడంపైనే ఆధారపడి ఉంటుందని సెంట్రమ్ బ్రోకింగ్ పేర్కొంది.




# కోతిని వేటాడుతూ.. విద్యుదాఘాతంతో చిరుత మృతి

**చంద్రపూర్:** కోతిని వేటాడుతూ ఓ చిరుతపులి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా చిమూర్ తాలూకా శంకరాపూర్ గ్రామ పరిసరాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు ఐదేళ్ల వయసున్న ఆడ చిరుత ఓ వానరాన్ని వెంబడిస్తూ గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలపైకి ఎక్కింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని చిమూర్ అటవీ క్షేత్రానికి తరలించారు. అక్కడ శవపరీక్ష నిర్వహించిన అనంతరం అటవీ శాఖ నిబంధనల ప్రకారం కళేబరాన్ని ఖననం చేశారు.

# ఇంగ్లిష్ పత్రికల్లో వ్యాసాలకే పరిమితం కాకండి

- కాంగ్రెస్ నిరసనల్లోనూ పాల్గొనాలని శశిథరూర్‌కు ఖర్గే సూచన
- సీడబ్ల్యూసీ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చ





**న్యూఢిల్లీ:** ఇంగ్లిష్ పత్రికల్లో వ్యాసాలు రాయడం తోపాటు కాంగ్రెస్ పార్టీ చేపట్టే నిరసన కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించినట్లు సమాచారం. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, శశిథరూర్ తదితర అగ్రనేతలు హాజరయ్యారు. సర్ అంశం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సంబంధించిన పరిణామాలు, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని న్యూఢిల్లీలో పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టాలని శశిథరూర్ సూచించినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన ఖర్గే.. పత్రికల్లో వ్యాసాలు రాయడంతోపాటు పార్టీ నిర్వహించే నిరసన కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించినట్లు సమాచారం. ఈ అంశంపై ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి. మరోవైపు ఇటీవల ఖర్గే పాల్గొన్న ఓ కార్యక్రమంలో వేదికను పసుపు నీటితో శుభ్రం చేసిన ఘటనపై కాంగ్రెస్ నుంచి విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ అంశంలో పార్టీ సీనియర్ నేతలు ఆశించిన స్థాయిలో స్పందించలేదని ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. తనకు పలువురు కాంగ్రెస్ నేతల నుంచి తగిన మద్దతు లభించలేదని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. శశిథరూర్ విషయానికి వస్తే.. ఆయన తరచూ వివిధ ఇంగ్లిష్ పత్రికలకు వ్యాసాలు రాస్తుంటారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడంతోపాటు పలు అంశాలపై సూచనలు చేస్తూ తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేతల తీరుపైనా ఆయన వ్యాఖ్యలు చేస్తుంటారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా శశిథరూర్ తన అభిప్రాయాలను వ్యాసాల రూపంలో వ్యక్తం చేస్తుంటారు. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ఎన్నికల వ్యవహారాలపై విస్తృతంగా చర్చించినట్లు సంబంధిత వార్తా నివేదికలు వెల్లడించాయి.

# కేరళ ఉపఎన్నికల్లో యూడీఎఫ్‌కు ఎదురుదెబ్బ

- 38 స్థానాల్లో యూడీఎఫ్ 19, ఎల్‌డీఎఫ్ 18
- ఏడు సిట్టింగ్ స్థానాలను కోల్పోయిన అధికార కూటమి

**తిరువనంతపురం:** కేరళలో అధికార యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)కు స్థానిక సంస్థల ఉపఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 38 స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో యూడీఎఫ్ 19 స్థానాల్లో విజయం సాధించగా, ప్రతిపక్ష లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) 18 స్థానాలను గెలుచుకుంది. మిగిలిన ఒక స్థానాన్ని ట్వెంటీ20 గెలుచుకుంది. గత స్థానిక ఎన్నికల్లో యూడీఎఫ్ 22, ఎల్‌డీఎఫ్ 15 స్థానాలను కలిగి ఉండగా, తాజా ఫలితాల్లో యూడీఎఫ్ మూడు స్థానాలను కోల్పోయి 19కు పరిమితమైంది. ఎల్‌డీఎఫ్ మూడు స్థానాలను అదనంగా సాధించింది. మొత్తంగా ఎల్‌డీఎఫ్ యూడీఎఫ్ నుంచి ఏడు స్థానాలను కైవసం చేసుకోగా, యూడీఎఫ్ ఎల్‌డీఎఫ్ నుంచి నాలుగు స్థానాలను తిరిగి దక్కించుకుంది. పాలక్కాడ్ జిల్లాలో యూడీఎఫ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చిట్టూర్–తత్తమంగళం మున్సిపాలిటీలో యూడీఎఫ్ నుంచి ఖాళీ అయిన స్థానంలో ఇరువురు అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో నిబంధనల ప్రకారం లాటరీ నిర్వహించ గా ఎల్‌డీఎఫ్ అభ్యర్థి విజయం సాధించారు. ఈ స్థానం గతంలో యూడీఎఫ్ నేత, ఎమ్మెల్యే సుమేశ్ అచ్యుతన్ ప్రాతినిధ్యం వహించినిది. కొట్టాయం జిల్లా పంచాయతీలోని త్రిక్కోడితానం డివిజన్‌లోనూ ఎల్‌డీఎఫ్ విజయం సాధించింది. మరోవైపు కోజికోడ్ కార్పొరేషన్‌లోని కుట్టిచిర, కొచ్చి కార్పొరేషన్‌లోని అయ్యప్పన్‌కావు స్థానాలను యూడీఎఫ్ నిలబెట్టుకుంది. ఫలితాల్లో పలు స్థానాల్లో యూడీఎఫ్ విజయాలు నమోదైనప్పటికీ గతంతో పోలిస్తే ఓట్ల ఆధిక్యం తగ్గడం కూడా కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన ఈ స్థానిక ఉపఎన్నికల్లో ఏడు స్థానాలను యూడీఎఫ్ నుంచి ఎల్‌డీఎఫ్ దక్కించుకోవడం ఆ పార్టీకి స్థానిక స్థాయిలో బలం పెంచుకునే అవకాశం కల్పించిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే 38 స్థానాలకే పరిమితమైన ఉపఎన్నికల ఫలితాలను రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయానికి నేరుగా ప్రతిబింబంగా చూడలేమని, ఆయా స్థానాల్లో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# యూట్యూబర్ ఇంట్లో చోరీ

- 98 సవర్ల బంగారం స్వాధీనం
- మధుమిత ఇంట్లో 118 సవర్ల బంగారం అపహరణ
- నలుగురు నిందితుల అరెస్టు





**కన్యాకుమారి:** తమిళనాడుకు చెందిన యూట్యూబర్ మధుమిత ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి గురైన 118 సవర్ల బంగారంలో 98 సవర్లు అంటే 784 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు నలుగురిని అరెస్టు చేశారు. కన్యాకుమారి జిల్లా రాజక్కమంగళం పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మతుకోణం వీఐపీ గార్డెన్‌లో మధుమిత తన భర్త వినోద్‌కుమార్‌తో కలిసి నివసిస్తున్నారు. మధుమిత తన వద్ద ఉన్న నగలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను తరచూ యూట్యూబ్, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుండటంతో ఆమె వద్ద ఉన్న నగలపై దొంగల కన్ను పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గత గురువారం దంపతులు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోని 118 సవర్ల బంగారంతో పాటు కొంత నగదు, ఇతర ఆభరణాలను దుండగులు అపహరించుకెళ్లారు. దీంతో మధుమిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివిధ కోణాల్లో విచారణ జరిపిన పోలీసులు 16 సీసీ కెమెరాల దృశ్యాలతో పాటు పలు కాల్ డేటాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 98 సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన సొత్తు, చోరీకి సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని కన్యాకుమారి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు ఇంట్లో భారీగా బంగారం చోరీకి గురైనప్పటికీ మధుమిత ఆ తర్వాత కూడా తన నగలు, ఆస్తులకు సంబంధించిన వీడియోలను యూట్యూబ్‌లో పోస్టు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

# రాజులు, రాజకుమారులకు దేవతలు ఖడ్గాలు ఇచ్చేవారా?

- తొమ్మిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో చారిత్రక ప్రస్తావనలు
- అరబ్, టర్కీష్, మొఘల్, యూరోపియన్ శక్తులకు వ్యతిరేకంగా భారతీయ పాలకుల ప్రతిఘటనపై వివరణ



**న్యూఢిల్లీ:** ఏడో శతాబ్దం తర్వాత శత్రుదేశాల నుంచి జరిగిన దాడులను ఎదుర్కొనేందుకు పలువురు రాజులు, రాజకుమారులకు కాళి, దుర్గా, భవానీ వంటి దేవతలు ఖడ్గాలను బహుమతిగా ఇచ్చేవారనే ప్రస్తావన ఎన్‌సీఈఆర్‌టీ తొమ్మిదో తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో చోటుచేసుకుంది. అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్–పార్ట్ 2’లోని ‘ప్రతిఘటన–దృఢత్వం’ అనే అధ్యాయంలో ఏడో శతాబ్దం నుంచి భారత ఉపఖండంపై జరిగిన దాడులు, వాటిని భారతీయ పాలకులు ఎదుర్కొన్న తీరును వివరించారు. బస్తర్‌ను పాలించిన అన్నమరాజకు మాణిక్యదేవి (దంతేశ్వరి) నుంచి ఖడ్గం లభించినట్లు సమాచారం ఉందని పుస్తకంలో పేర్కొన్నారు. మదురైలో సుల్తాన్‌లకు వ్యతిరేకంగా పోరాడిన విజయనగర రాజు కుమార కంపన దేవత ప్రసాదించిన ఖడ్గంతోనే యుద్ధంలో పాల్గొన్నట్లు వివరించారు. అదేవిధంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ తుల్జాభవానీ దేవి నుంచి ఖడ్గం స్వీకరించినట్లు సంప్రదాయంగా విశ్వసిస్తారని పేర్కొన్నారు. రాజులు దేవతలను ఆరాధించడం సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంప్రదాయమని, ఆధ్యాత్మిక విశ్వాసాలు, మతపరమైన సంప్రదాయాలకు సంబంధించిన అంశాలను కూడా ఈ అధ్యాయంలో వివరించారు. ఏడో శతాబ్దం నుంచి భారత ఉపఖండం మతపరమైన ఉద్దేశాలతో వరుస దాడులను ఎదుర్కొన్నట్లు పాఠ్యపుస్తకంలో పేర్కొంటూ, అరబ్, టర్కీష్, మొఘల్, యూరోపియన్ శక్తులకు వ్యతిరేకంగా భారతీయ పాలకులు ఎప్పుడు, ఎలా ప్రతిఘటించారనే అంశాలను ఇందులో ప్రస్తావించారు. మాధ్యమిక స్థాయిలో విద్యార్థుల్లో విమర్శనాత్మక పరిశోధనా దృక్పథాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సామాజిక శాస్త్ర పాఠ్యాంశాన్ని అభివృద్ధి చేసినట్లు ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్ దినేశ్ సక్లానీ తెలిపారు.

# విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్య ఆలోచనలు

- చదువు, ఉద్యోగంపై ఆందోళన
- 15 శాతం మందిలో దీర్ఘకాలిక క్షోభ, నిరాశ, ఆందోళన

**న్యూఢిల్లీ:** చదువుతున్న కోర్సుపై ఆందోళన.. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం లభిస్తుందో లేదోనన్న బెంగ.. తదుపరి మరో కోర్సు చేయాలా? వద్దా? చేస్తే ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయన్న గందరగోళం.. ఇలా వివిధ కారణాలతో నేటి యువత తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. విద్యార్థుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన పరిశీలనలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఉన్నత విద్యా సంస్థల్లో గత ఏడాది కాలంలో ప్రతి పది మంది విద్యార్థుల్లో ఒకరు ఆత్మహత్య ఆలోచనలతో బాధపడినట్లు టాస్క్‌ఫోర్స్ గుర్తించింది. అలాగే గత ఆరు నెలల్లో 15 శాతం మంది విద్యార్థులు దీర్ఘకాలిక క్షోభ, నిరాశ, ఆందోళన వంటి పరిస్థితులను ఎదుర్కొన్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 2.43 లక్షల మంది విద్యార్థులను సర్వే చేయగా, 34 శాతం మంది తమ క్యాంపస్‌లో తాము బయటి వ్యక్తులుగా, ఒంటరిగా ఉన్నట్లుగా భావిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల పై చదువు, భవిష్యత్ ఉద్యోగావకాశాలు, తదుపరి విద్య వంటి అంశాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని టాస్క్‌ఫోర్స్ పరిశీలనలో తేలింది.



# ఫుట్‌బాల్ క్రీడాకారుల బస్సుపై సాయుధుల దోపిడీ

- 12 మంది దుండగులు అడ్డగించి నగదు, మొబైల్లు, విలువైన వస్తువుల అపహరణ
- క్రీడాకారులపై దాడి

**బలూచిస్తాన్:** పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. క్వెట్టాలో నిర్వహిస్తున్న సీఎం గోల్డ్ కప్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కరాచీ డిస్ట్రిక్ట్ వెస్ట్ స్క్వాడ్ జట్టుకు చెందిన క్రీడాకారుల బస్సును సాయుధ దుండగులు అడ్డగించి దోపిడీకి పాల్పడ్డారు. మస్తుంగ్–సరియాబ్ మార్గంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు 12 మంది ఆయుధాలతో బస్సును అడ్డుకుని, తుపాకులతో బెదిరిస్తూ క్రీడాకారుల వద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను దోచుకున్నారు. అంతటితో ఆగకుండా క్రీడాకారుల దుస్తులు విప్పించి, కొందరిపై దాడి చేసిన అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు అక్కడికి చేరుకుని క్రీడాకారులకు సహాయం అందించాయి. అనంతరం వారిని సురక్షితంగా క్వెట్టా చేరుకునేలా చర్యలు చేపట్టారు. పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన క్రీడాకారుల వద్ద పెద్దగా నగదు కూడా లేదని అధికారులు తెలిపారు. ఘటనపై బలూచిస్తాన్ క్రీడాశాఖ మంత్రి స్పందిస్తూ క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఇటీవలి కాలంలో దోపిడీలు, ఇతర నేర ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# తోటి జవాన్లపై కాల్పులు

- నలుగురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది మృతి
- కథువాలో విధులు మారే సమయంలో వివాదం
- అసిస్టెంట్ కమాండెంట్, ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల మృతి
- జవాన్ మృతి, నలుగురికి గాయాలు



**జమ్ము కశ్మీర్:** జమ్ము కశ్మీర్‌లోని కథువా జిల్లాలో తోటి జవాన్ జరిపిన కాల్పుల్లో నలుగురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది మృతి చెందారు. సేవా–2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఉన్న క్యాంపులో విధులు మారుతున్న సమయంలో సీఐఎస్ఎఫ్ జవాన్‌ల మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఓ జవాన్ తన సహచరులపై కాల్పులు జరపడంతో నలుగురు తీవ్రంగా గాయపడి మృతి చెందారు. మృతుల్లో అసిస్టెంట్ కమాండెంట్, ఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇదిలా ఉండగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని చాంగ్‌లాంగ్ జిల్లాలో భారత్–మయన్మార్ సరిహద్దు సమీపంలో అస్సాం రైఫిల్స్ పెట్రోలింగ్ బృందంపై మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. నాపాంగ్ సర్కిల్‌లోని నాపాంగ్ నాలా సమీపంలో ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడిలో ఓ జవాన్ మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించి, ఘటనపై భద్రతా బలగాలు దర్యాప్తు చేపట్టాయి.

# సహోద్యోగులపై సీఐఎస్ఎఫ్ జవాన్ కాల్పులు

- నలుగురు మృతి
- కతువాలో డ్యూటీ మార్పు సమయంలో వాగ్వాదం

**జమ్మూకశ్మీర్:** జమ్మూకశ్మీర్‌లో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఓ జవాన్ తన సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఓ ఉన్నతాధికారి కూడా ఉన్నారు. కతువా జిల్లాలోని బసోహ్లి ప్రాంతంలో ఉన్న సేవా–2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఈ దారుణం జరిగింది. ఈ ప్రాజెక్టుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం డ్యూటీ మార్పు సమయంలో హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్‌కు, ఇతర సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన అవధేశ్ సింగ్ తన వద్ద ఉన్న తుపాకీతో సహోద్యోగులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫిక్ అహ్మద్, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన ఇతర సీఐఎస్ఎఫ్ సిబ్బంది నిందితుడు అవధేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని కతువా పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనను కతువా ఎస్ఎస్పీ మోహితా శర్మ ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరో వైపు సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం ఘటనపై తీవ్రంగా స్పందించింది. కాల్పులకు దారితీసిన పూర్తి కారణాలను వెలుగులోకి తెచ్చేందుకు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డీజీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేవలం చిన్నపాటి వాగ్వాదమే కాల్పులకు కారణమా, లేక ఘటన వెనుక మరేదైనా నేపథ్యం ఉందా అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



# భళా భారత్!

- ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండు స్వర్ణాలు
- అథ్లెటిక్స్ మహిళల 4×400 మీటర్ల రిలేలో పసిడి
- వ్యక్తిగత ట్రాప్‌లో చరిత్ర సృష్టించిన నీరు ధండా
- ఒకే రోజు 8 పతకాలు



**నాగోయా:** ఆసియా క్రీడల్లో మంగళవారం భారత్ రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది. అథ్లెటిక్స్‌లో మహిళల 4×400 మీటర్ల రిలే జట్టు, షూటింగ్‌లో నీరు ధండా పసిడి పతకాలు సాధించారు. దీంతో అథ్లెటిక్స్‌లో భారత్‌కు ఈ క్రీడల్లో తొలి స్వర్ణం లభించగా.. వ్యక్తిగత ట్రాప్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా నీరు చరిత్ర సృష్టించింది. కిరణ్ పహల్, ఎం.ఆర్. పూవమ్మ, ప్రాచి చౌదరి, విథ్యా రామ్‌రాజ్ 3:29.69 సెకన్లలో 4×400 మీటర్ల రిలేను పూర్తి చేసి స్వర్ణం సాధించారు. చివరి లెగ్‌లో విథ్యా చైనా, బ్రాహ్మిన్ రన్నర్లను వెనక్కినెట్టి విజయాన్ని ఖాయం చేసింది. బ్రాహ్మిన్‌కు రజతం, చైనాకు కాంస్యం లభించాయి. 2002 నుంచి 2018 వరకు వరుసగా స్వర్ణాలు సాధించిన భారత్.. గత క్రీడల్లో రజతంతో సరిపెట్టుకుంది. షూటింగ్‌లో ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొన్న నీరు ధండా మహిళల వ్యక్తిగత ట్రాప్ ఫైనల్లో 30 టార్గెట్లలో 28ను ఛేదించి కాంటినెంటల్ రికార్డుతో స్వర్ణం గెలిచింది. చైనాకు చెందిన సన్ యునాంగ్ రజతం, కువైట్ షూటర్ అబ్దుల్‌మొలిక్ హజర్ కాంస్యం సాధించారు. ఇదే రోజు ఆశిమా అహ్లావత్, మనీషా కీర్‌తో కలిసి నీరు టీమ్ ట్రాప్‌లో రజతం కూడా సాధించింది. మహిళల ట్రాప్‌లో భారత్‌కు ఇదే తొలి వ్యక్తిగత ఆసియా క్రీడల పతకం. 1978లో రంధీర్ సింగ్ తర్వాత 48 ఏళ్లకు భారత్‌కు వ్యక్తిగత ట్రాప్‌లో స్వర్ణం దక్కింది. పోటీకి పది రోజుల ముందు తీవ్ర ఫ్లూతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నీరు.. కోచ్ మాన్వేర్ సింగ్ ప్రోత్సాహంతో బరిలోకి దిగి పసిడి సాధించింది. ఈ పతకాన్ని సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న జ వాన్లకు, రంధీర్ సింగ్‌కు అంకితం చేస్తున్నట్లు తెలిపింది.

### గుల్వీర్‌కు మూడో పతకం

అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్ పురుషుల 5000 మీటర్లలో 13:32.75 సెకన్లతో కాంస్యం సాధించాడు. 1500, 10,000 మీటర్లలో ఇప్పటికే రజతాలు గెలిచిన అతడికి ఇది మూడో పతకం. పూజా సింగ్ (హైజంప్), మిక్స్‌డ్ 4×100 మీటర్ల రిలే, పురుషుల 4×400 మీటర్ల రిలే జట్లు కూడా కాంస్యాలు గెలిచాయి. దీంతో అథ్లెటిక్స్‌లో భారత్ ఖాతాలో 1 స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలతో మొత్తం 24 పతకాలు చేరాయి. పోల్‌వాల్ట్‌లో దేవ్‌కుమార్ మీనా 5.50 మీటర్లతో జాతీయ రికార్డు నెలకొల్పినా ఏడో స్థానంలో నిలిచాడు. ఇక బాక్సింగ్‌లో నరేందర్ బర్వాల్ కాంస్యం దక్కించుకున్నాడు.

## టెస్టుల్లో తప్పుకున్నందుకు కోహ్లీ బాధపడొచ్చు

- అతడికి మరో 2–3 ఏళ్లు ఆడే సత్తా ఉంది: కపిల్ దేవ్



**న్యూఢిల్లీ:** విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకడం తనను బాధించిందని భారత దిగ్గజం కపిల్ దేవ్ అన్నారు. కోహ్లీకి ఇంకా రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం టెస్టులు ఆడే సామర్థ్యం ఉందని, భవిష్యత్తులో టెస్టుల నుంచి ఎందుకు తప్పుకున్నానా అని బాధపడొచ్చని పేర్కొన్నారు. అయితే రిటైర్మెంట్ నుంచి తిరిగి రావాలా వద్దా అనేది పూర్తిగా కోహ్లీ నిర్ణయమేనని స్పష్టం చేశారు. 2025లో ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. అప్పటికి 10 వేల టెస్టు పరుగుల మైలురాయికి 770 పరుగుల దూరంలో ఉన్నాడు. ఫిట్‌నెస్ కొనసాగిస్తే టెస్టులు ఆడటం అతనికి సమస్య కాదని, టెస్టు క్రికెట్ కోహ్లీకి సరైన ఫార్మాట్ అని కపిల్ అన్నారు. ఇటీవల 55వ వన్డే సెంచరీ చేసిన కోహ్లీ మరో 2–3 ఏళ్లు ఇదే ఫిట్‌నెస్‌తో కొనసాగితే మరిన్ని రికార్డులు సాధించగలడని చెప్పారు. జస్‌ప్రీత్ బుమ్రా మూడు ఫార్మాట్లలోనూ ఆడేందుకు ప్రయత్నించాలని కపిల్ సూచించారు. అయితే ప్రతి ఆటగాడు తన శరీరం చెప్పే మాటను విని, తనకు ఏది సరైనదో తానే నిర్ణయించుకోవాలని స్పష్టం చేశారు.

# కివీస్ పర్యటనకు కసరత్తు

- గంభీర్‌తో సెలక్షన్ కమిటీ భేటీ
- టీ20, వన్డే, టెస్టులతో పాటు భారత్ ఏ జట్ల ఎంపికపై చర్చ
- తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా హాజరైన ప్రజ్ఞాన్ ఓజా
- ప్రపంచకప్ దృష్ట్యా ఆటగాళ్ల పనిభారంపైనా దృష్టి

**గువాహటి:** న్యూజిలాండ్ పర్యటన కోసం పలు భారత జట్లను ఎంపిక చేయాల్సి ఉండటంతో జాతీయ సెలెక్షన్ కమిటీ సభ్యులు గువాహటిలో సమావేశమయ్యారు. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ముందు మంగళవారం భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్.. నలుగురు సెలెక్టర్లు శివసుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్.పీ. సింగ్, ప్రజ్ఞాన్ ఓజాలతో సుదీర్ఘంగా చర్చించారు. ద్వైపాక్షిక సిరీస్ జరుగుతున్న సమయంలో నలుగురు సెలెక్టర్లు ఒకేసారి అందుబాటులో ఉండడం సాధారణం కాకపోవడంతో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశానికి మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకాలేదు. ప్రస్తుతం ప్రజ్ఞాన్ ఓజా సెలెక్షన్ కమిటీకి మధ్యంతర అధిపతిగా వ్యవహరిస్తున్నారు. న్యూజిలాండ్ పర్యటన కోసం టీ20, వన్డే, టెస్టు జట్లతోపాటు భారత్ ఏ జట్టు మూడు టెస్టుల కోసం కూడా ఆటగాళ్లను ఎంపిక చేయాల్సి ఉంది. భారత్ అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27వరకు న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి టీ20తో సిరీస్ ప్రారంభమవుతుంది. నవంబర్ 4 నుంచి ఆక్లాండ్‌లో ఐదు వన్డేలు జరుగుతాయి. నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్‌లలో రెండు టెస్టులు నిర్వహించనున్నారు. ఇక భారత్ ఏ జట్టు అక్టోబర్ 24 నుంచి నవంబర్ 10 వరకు మూడు టెస్టులు ఆడనుంది. నవంబర్ 15న చివరి వన్డే, నవంబర్ 19న తొలి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో వన్డే జట్టులో ఉన్న కొందరు కీలక టెస్టు ఆటగాళ్లను ముందుగానే విడిపించి శిక్షణకు పంపే అంశంపైనా సెలెక్టర్లు దృష్టి పెట్టనున్నారు. మరోవైపు 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహాలు వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో న్యూజిలాండ్ పర్యటన ద్వారా వివిధ ఫార్మాట్లలో ఆటగాళ్ల కలయిక, వారి పనిభారాన్ని అంచనా వేసేందుకు జట్టు మేనేజ్‌మెంట్, సెలెక్టర్లకు అవకాశం లభించనుంది.

# గువాహటిలో 'రోకో' మానియా

- స్టార్ క్రికెటర్ల కోసం అభిమానుల సందడి
- వెస్టిండీస్‌తో రెండో వన్డేకు సిద్ధమైన బార్సాపారా స్టేడియం

**గువాహటి:** ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా.. వన్డే క్రికెట్‌పై ఆసక్తి కొంత తగ్గినా.. గువాహటిలోని బార్సాపారా స్టేడియం బుధవారం భావోద్వేగానికి వేదిక కానుంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భారత్ తరఫున బరిలోకి దిగ



నుండటంతో నగరంలో 'రోకో' మానియా నెలకొంది. గువాహటిలో వీరిద్దరి చివరి భారత వన్డే ప్రదర్శన కావచ్చన్న అంచనాలతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. కోహ్లీ, రోహిత్‌ను చూసేందుకు అభిమానులు విమానాశ్రయంలో బారులు తీరగా.. మార్కెట్‌లో ఇద్దరి పోస్టర్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌కు బార్సాపారా వేదికగా పలు మ్యాచ్‌లు నిర్వహించినా ఇటీవలి కాలంలో టీ20లకే అభిమానుల నుంచి ఎక్కువ ఆదరణ లభిస్తోంది. గువాహటిలో చివరి వన్డే 2023 ప్రపంచకప్‌కు ముందు జరిగింది. అయితే బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌కు మాత్రం భారీ స్పందన కనిపించే అవకాశం ఉంది.

### కింగ్ ఫామ్‌తో మరింత ఆసక్తి

కింగ్ కోహ్లీ అద్భుత ఫామ్ అభిమానుల అంచనాలను మరింత పెంచింది. గువాహటిలో అతడి చివరి వన్డేలో శ్రీలంకపై 45వ వన్డే సెంచరీ సాధించాడు. ఇటీవల 55వ వన్డే శతకం నమోదు చేయడం తో పాటు సచిన్ టెండూల్కర్ తర్వాత వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తిచేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. కోహ్లీ, రోహిత్ ఇద్దరూ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడే అవకాశం ఉండటంతో గువాహటి మ్యాచ్‌కు వీడ్కోలు వాతావరణం నెలకొంది. అయితే అసలు వీడ్కోలు ఇంకా దూరంలోనే ఉంది. భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సైరాజ్ బహుతులే మాట్లాడుతూ.. కోహ్లీ ప్రతి సిరీస్, ప్రతి మ్యాచ్‌తో మెరుగవ్వాలని తపిస్తుంటాడని అన్నారు. రోహిత్, కోహ్లీ అనుభవం జట్టులోని యువ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కోహ్లీ తన ఆటతోపాటు ఫిట్‌నెస్‌పై నిరంతరం పనిచేయడం స్ఫూర్తిదాయకమన్నారు.






# భారత్–ఖతార్ వాణిజ్య బంధంపై కీలక చర్చలు

- బీఐటీ, ఎఫ్‌టీఏపై వేగం పెంచే దిశగా అడుగులు
- రూ.10 బిలియన్ డాలర్ల పెట్టుబడుల అమలుపై చర్చ
- యూపీఐ విస్తరణ, క్యూఐఏ కార్యాలయం ఏర్పాటు
- హోర్ముజ్ మార్గంలో వాణిజ్యానికి అవరోధాలు లేకుండా చూడాలన్న నిర్మలా సీతారామన్

**దోహా/న్యూఢిల్లీ:** భారత్, ఖతార్ మధ్య పెట్టుబడులు, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కీలక చర్చలు జరిపారు. ఖతార్ ఆర్థిక మంత్రి అలీ బిన్ అహ్మద్ అల్ కువారీ, విదేశీ వాణిజ్య శాఖ సహాయ మంత్రి అహ్మద్ బిన్ మహమ్మద్ అల్ సయీద్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ)ను ఖరారు చేయడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చలను వేగవంతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. ఖతార్‌లో యూపీఐ విస్తరణ, భారత్‌లో ఖతార్ ప్రకటించిన 10 బిలియన్ డాలర్ల పెట్టుబడుల అమలు, ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) కార్యాలయం ఏర్పాటు, ఎన్‌ఐఐఎఫ్‌తో భాగస్వామ్యం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పందాన్ని మరింత బలోపేతం చేయడంపైనా చర్చించారు. ఖతార్ వాణిజ్య శాఖ సహాయ మంత్రితో భేటీలో గల్ఫ్ దేశాలతో సాధారణ వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని సీతారామన్ ప్రస్తావించారు. హోర్ముజ్ జలసంధి మీదుగా సముద్ర రవాణా, వాణిజ్యానికి అవరోధాలు లేకుండా చూడాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ఖతార్ బిజినెస్‌మెన్ అసోసియేషన్ రౌండ్‌టేబుల్‌లో పాల్గొన్న సీతారామన్.. భారత్‌లో పెట్టుబడి అవకాశాలను వివరించారు. 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతం, పెట్టుబడులు 11.9 శాతం పెరిగినట్లు తెలిపారు. రెండు దేశాల్లోని కొత్త అవకాశాలను పరిశీలించి వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలని ఖతార్ వ్యాపారవేత్తలను కోరారు.




## వరుసగా రెండో రోజు నష్టాల్లో మార్కెట్లు

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టాల్లో ముగిశాయి. ముడిచమురు ధరలు, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ పెరుగుదల, ఇరాన్ అంశంపై అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 242.65 పాయింట్లు (0.33 శాతం) తగ్గి 72,529.07 వద్ద, నిఫ్టీ 64.05 పాయింట్లు (0.28 శాతం) క్షీణించి 22,716.20 వద్ద ముగిశాయి. సెన్సెక్స్‌లో టైటాన్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్ లాభపడ్డాయి. సోమవారం ఎఫ్ఐఐలు రూ.5,353.22 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. అస్థిర ముడిచమురు ధరలు, అధిక అమెరికా ఈల్డ్స్, ఎఫ్ఐఐల అమ్మకాలు రూపాయిపై ఒత్తిడి పెంచుతున్నాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ ఆఫ్ రీసెర్చ్ వినోద్ నాయర్ తెలిపారు. నెలవారీ ఎఫ్‌అండ్‌ఓ గడువు ముగింపు కూడా అమ్మకాల ఒత్తిడికి కారణమైందని రిలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా చెప్పారు. ఆసియా మార్కెట్లలోనూ నిక్కీ, కోస్పి, హ్యాంగ్‌సెంగ్ నష్టాల్లో ముగిశాయి.

# పీఎఫ్ ట్రస్టులపై ఈపీఎఫ్ఓ దృష్టి

- సభ్యుల పొదుపులు, హక్కుల రక్షణకు ప్రాధాన్యం
- అమ్నెస్టీ–2026తో నిబంధనల క్రమబద్ధీకరణకు అవకాశం




**ముంబై:** ఈపీఎఫ్ఓ నుంచి మినహాయింపు పొందిన సంస్థలు ప్రావిడెంట్ ఫండ్ వ్యవస్థలో కీలకమైనవని అదనపు కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ (ఏసీసీ) ఉమా మండల్ అన్నారు. సభ్యుల సామాజిక భద్రతకు ఈపీఎఫ్ఓ సంరక్షకుడిగా ఉన్నందున వారి విశ్వాసం, పొదుపులు, హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ముంబైలో బీఎస్ఈలో జరిగిన పీఎఫ్ సంస్థల యజమానులు, ట్రస్టీల వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ఈపీఎఫ్ఓ నియంత్రణ ఆధారిత విధానం నుంచి సంప్రదింపులు, సలహాలతో కూడిన వ్యవస్థ వైపు మారుతోందని చెప్పారు. ముంబై బాంద్రా జోన్‌లో 161 మినహాయింపు పొందిన పీఎఫ్ సంస్థలు, 14 లక్షల కాంట్రిబ్యూటింగ్ సభ్యులు, 40 లక్షల యూఏఎన్ ఖాతాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ట్రస్టుల వద్ద సుమారు రూ.1.30 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు. కొత్త సరళీకృత ఎస్ఓపీపై వర్క్‌షాప్‌లో వివరించారు. నాన్–కేవైసీ, ఇనాపరేటివ్ ఖాతాలు, బదిలీ నిధులపై వడ్డీ, మినహాయింపు రద్దు, దరఖాస్తుల పరిష్కార గడువులపై చర్చించారు. సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకోవాలని, మినహాయింపు రద్దును చివరి మార్గంగా పరిగణించాలని సూచించారు. పీఎఫ్ ట్రస్టులు నిబంధనలను క్రమబద్ధీకరించుకునేందుకు ఆరు నెలలపాటు కల్పించిన అమ్నెస్టీ–2026 అవకాశాన్ని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–1 రితేష్ సైనీ వివరించారు. ఆడిట్లు, సభ్యుల రికార్డులు, కేవైసీ, నిధుల బదిలీ, ఉద్యోగుల ప్రయోజనాల రక్షణ అంశాలను వివరించారు. ట్రస్టుల పెట్టుబడి విధానం, ఆస్తుల వర్గాలు, రిస్క్–రిటర్న్స్‌పైనా అవగాహన కల్పించారు.

# స్పామ్ కాల్స్‌పై ట్రాయ్ కఠిన నిబంధనలు

- ఏఐ గుర్తించిన అనుమానిత కాల్స్‌పైనా చర్యలు
- ఐదు నంబర్లు ఉంటే 15 రోజుల ఔట్‌గోయింగ్ నిలిపివేత
- మళ్లీ ఉల్లంఘిస్తే ఏడాది నిషేధం.. బ్లాక్ ప్రోమోతో ప్రమోషనల్ కాల్స్ పూర్తిగా నిలిపివేత




**న్యూఢిల్లీ:** స్పామ్, వేధింపు కాల్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఏఐ/మెషిన్ లెర్నింగ్ వ్యవస్థలు 'సస్పెక్టెడ్ స్పామ్'గా గుర్తించిన కాల్స్‌పై వినియోగదారు ఫిర్యాదు చేయకపోయినా టెలికాం సంస్థలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం అనుమానిత కాల్ వివరాలను రెండు గంటల్లో సంబంధిత నెట్‌వర్క్‌కు పంపాలి. ఆ సంస్థ ఒక పని దినంలో పంపిన వ్యక్తికి కేవైసీ గుర్తింపును పరిశీలించి ఇతర ఆపరేటర్లతో పంచుకోవాలి. గత 10 రోజుల్లో అదే వ్యక్తికి చెందిన ఐదు లేదా అంతకంటే ఎక్కువ నంబర్లు స్పామ్‌గా గుర్తిస్తే.. మొదటి ఉల్లంఘనకు అన్ని టెలికాం వనరుల ఔట్‌గోయింగ్ సేవలను 15 రోజుల పాటు నిలిపివేస్తారు. ఉల్లంఘన పునరావృతమైతే సిమ్‌లు, పీఆర్ఐ/ఎస్ఐపీ ట్రంక్‌లు సహా అన్ని టెలికాం వనరులను ఏడాది పాటు డిస్‌కనెక్ట్ చేసి బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. అత్యవసర సేవలకు కాల్ చేసేందుకు ఒక నంబర్‌ను మాత్రం అనుమతిస్తారు. అన్ని ప్రమోషనల్ కాల్స్ వద్దనుకునే వినియోగదారులు 1909కు బ్లాక్ ప్రోమో అని ఎస్ఎంఎస్ పంపవచ్చు. అయితే లావాదేవీ, సేవలు, ప్రభుత్వ సమాచార కాల్స్‌కు ఇది వర్తించదు. 1600 సిరీస్ వంటి నియంత్రిత నంబర్లను ట్రూకాలర్ తరహా యాప్‌లు స్పామ్‌గా ట్యాగ్ చేయడం లేదా ఫిల్టర్ చేయడంపైనా పరిమితులు విధించారు. ఏపీ కాల్స్‌కు నిమిషానికి గరిష్ఠంగా 5 పైసల ఛార్జీ విధించే అవకాశం కల్పించారు. కొత్త నిబంధనలు 60–90 రోజుల్లో దశలవారీగా అమల్లోకి రానున్నాయి. ఏపీ నిబంధనలు 60 రోజుల్లో, బ్లాక్‌చెయిన్ ఆధారిత అప్పీల్ విధానం 90రోజుల్లో అమల్లోకి వస్తాయి.

## అరవిందో ఫార్మాకు జీఎస్టీ షాక్

- రూ.4.60 కోట్ల చెల్లింపునకు ఆదేశాలు
- రూ.2.56 కోట్ల ఐటీసీ రివర్స్

**న్యూఢిల్లీ:** అరవిందో ఫార్మాపై రూ.4.60 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రివర్సల్ డిమాండ్‌ను తెలంగాణ జీఎస్టీ అప్పిలేట్ అథారిటీ సమర్థించింది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనంగా క్లెయిమ్ చేసిన ఐటీసీని రివర్స్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు మల్కాజ్‌గిరి డివిజన్, హైదరాబాద్‌కు చెందిన అప్పిలేట్ జాయింట్ కమిషనర్ (ఎస్టీ) గతంలో జారీ చేసిన ఉత్తర్వులను అథారిటీ తాజాగా సమర్థించింది. కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం.. అదనంగా క్లెయిమ్ చేసినట్లు పేర్కొన్న రూ.2,56,44,999 ఐటీసీని రివర్స్ చేయాలని అథారిటీ ఆదేశించింది. దీనికి రూ.1,78,19,409 వడ్డీ, రూ.25,64,500 జరిమానా విధించింది. దీంతో మొత్తం డిమాండ్ రూ.4,60,28,908కు చేరింది.

2020–21 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీఆర్–3బీలో కంపెనీ క్లెయిమ్ చేసిన ఐటీసీ, జీఎస్టీఆర్–2ఏలో ప్రతిబింబించిన ఐటీసీ కంటే అధికంగా ఉందన్న అంశంపై ఈ వివాదం తలెత్తింది. ఈ కేసులో ఫిబ్రవరి 28, 2025న జారీ చేసిన ఉత్తర్వులను తాజాగా అప్పిలేట్ అథారిటీ సమర్థించింది. ఈ ఉత్తర్వులు సెప్టెంబర్ 28న తమకు అందినట్లు అరవిందో ఫార్మా తెలిపింది. అథారిటీ ఆదేశాలను సవాల్ చేస్తూ జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ వివాదం తమ కార్యకలాపాలు లేదా ఆర్థిక పనితీరుపై గణనీయమైన ప్రభావం చూపదని పేర్కొంది.

# 16 శాతం పెరిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు

- రూ.10 వేలలోపు ఫోన్లపై 32శాతం భారం
- వెల్లడించిన కౌంటర్‌పాయింట్ రీసెర్చ్

**న్యూఢిల్లీ:** భారత్‌లో స్మార్ట్‌ఫోన్ల ధరలు 2026 తొలి అర్ధభాగంలో సగటున 16శాతం పెరిగినట్లు కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, రూపాయి బలహీనపడడం, దిగుమతి విడిభాగాల వ్యయం అధికం కావడం ఇందుకు కారణాలని పేర్కొంది. రెండో త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ల సగటు విక్రయ ధర రికార్డు స్థాయిలో 318 డాలర్లకు చేరింది. రూ.10వేలలోపు ఫోన్ల ధరలు 32 శాతం పెరగడంతో ఈ విభాగం షిప్‌మెంట్లు 65 శాతం తగ్గాయి. రూ.10 వేల–15 వేల విభాగంలోనూ 20 శాతం క్షీణత నమోదైంది. మరోవైపు రూ.20 వేలకుపైగా ఫోన్లకు డిమాండ్ కొనసాగింది. ఎక్స్‌టెండెడ్ వారంటీ, నో–కాస్ట్ ఈఎంఐలు ఇందుకు దోహదపడ్డాయని సంస్థ తెలిపింది. దేశంలో విక్రయించే ఫోన్లలో 99 శాతం దేశీయంగానే తయారవుతున్నా.. ఏఐ డేటా సెంటర్ల నుంచి పెరిగిన డిమాండ్‌తో డీఆర్ఏఎం, నాండ్ మెమరీ చిప్‌ల సరఫరాపై ఒత్తిడి పెరిగిందని పేర్కొంది. రూపాయి బలహీనత దిగుమతి వ్యయాలను మరింత పెంచుతోందని తెలిపింది.

### వన్‌ప్లస్ ధరల వ్యూహం

వన్‌ప్లస్ ధరలను సగటున 8 శాతమే పెంచింది. రూ.20 వేలకుపైగా విభాగంలో రెండో త్రైమాసికంలో ఆన్‌లైన్ విక్రయాల పరంగా టాప్–5 బ్రాండ్లలో వేగంగా వృద్ధి చెందిన బ్రాండ్‌గా నిలిచింది. ఏడాది ప్రారంభంలోనే తక్కువ ధరలకు మెమరీ చిప్‌లను కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడం ఇందుకు దోహదపడిందని కౌంటర్‌పాయింట్ తెలిపింది. మెమరీ చిప్‌ల ధరలు 2028కి ముందు తగ్గే అవకాశం లేదని సంస్థ అంచనా వేసింది. దీంతో స్మార్ట్‌ఫోన్ ధరలపై ఒత్తిడి కొనసాగవచ్చని పేర్కొంది.




## అద్దం ముందు డ్యాన్స్ చేస్తూ.. హీరోయిన్‌గా ఊహించుకునేదాన్ని

బాలీవుడ్ యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ శార్వరి వాఘ్ తన అందం, అభినయంతో వరుస అవకాశాలు అందుకుంటూ చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం ప్రముఖ దిగ్గజ దర్శకుడు సూరజ్ బార్జాత్యా తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'యే ప్రేమ్ మోల్ లియా'లో నటిస్తోంది. రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శార్వరి కనిపించనుంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. తాజాగా విడుదలైన టైటిల్ సాంగ్ యూట్యూబ్‌లో మంచి ఆదరణ పొందుతూ ట్రెండ్ అవుతోంది. ఈ పాట విడుదల కార్యక్రమంలో పాల్గొన్న శార్వరి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నతనంలో 'దిదీ తేరా దేవర్ దీవానా' పాటలో మాధురీ దీక్షిత్, 'మైయ్యా యశోదా' పాటలో కరిష్మా కపూర్, సోనాలీ బింద్రేలను చూస్తూ పెరిగానని ఆమె తెలిపారు. ఆ ఐకానిక్ పాటలను చూసిన ప్రతిసారీ ఇంటికి వెళ్లి అద్దం ముందు నిలబడి డ్యాన్స్ చేసేదాన్నని, ఆ సమయంలో తనను తాను తెరపై హీరోయిన్‌గా ఊహించుకునేదాన్నని శార్వరి చెప్పుకొచ్చారు. ఆ పాతతరం బాలీవుడ్ క్లాసిక్ పాటల్లో కనిపించే ప్రేమ, భావోద్వేగాలు, మ్యూజిక్ తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, వాటి ద్వారానే నటిగా మారాలనే బలమైన కోరిక తనలో ఏర్పడిందని వెల్లడించారు. అలాంటి చిత్రాలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన లెజెండరీ దర్శకుడు సూరజ్ బార్జాత్యా దర్శకత్వంలో నటించడం తన చిన్ననాటి కల నెరవేరినట్లుగా అనిపిస్తోందని శార్వరి ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఈ చిత్రంలో సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రొమాన్స్, కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## 'రణబాలి' బ్రిటీష్ పాలనలో కరువు కథ

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. విజయదశమి సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ విడుద లకు సిద్ధమ వుతోంది. ఈ నేపథ్యంలో 'రణబాలి: నెవర్ ఫర్‌గెట్ ది ట్రూత్' పేరుతో రూపొం దిం చిన నాలుగు భాగాల డాక్యు మెం టరీ సిరీస్‌లో తొలి ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్‌గాట్' తాజాగా స్ట్రీమింగ్‌కు వచ్చింది. 1876–78 మధ్య బ్రిటిష్ పాలనలో సంభవించిన కరువు కారణంగా కోట్లాది మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనను ఈ ఎపిసోడ్‌లో ప్రస్తావించారు. ప్రజలు ఆకలితో అలమటిస్తున్న సమయంలో బ్రిటిష్ పాలకులు భారీ మొత్తంలో ధాన్యాన్ని తమ దేశానికి, యుద్ధాలు జరుగుతున్న ప్రాంతాలకు తరలించిన తీరును ఇందులో చూపించారు. సుమారు 150 ఏళ్ల నాటి ఈ చారిత్రక ఘటనపై పరిశోధన చేసి 'రణబాలి' చిత్రాన్ని రూపొందించినట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సందర్భంగా రష్మిక మందన్న మాట్లాడుతూ.. ఈ కరువు ఘటన గురించి తెలుసుకున్నప్పుడు ఎంతో బాధగా అనిపించిందని, నాటి ప్రజలు పడిన బాధను, చేసిన త్యాగాలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించానని తెలిపారు. చరిత్రలో ఏం జరిగిందో తెలుసుకోవడంతోపాటు ఇలాంటి గొప్ప చిత్రంలో నటించే అవకాశం అరుదుగా లభిస్తుందని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. కరువు సమయంలో భారతీయులు ఆకలితో చనిపోతుంటే మరోవైపు బ్రిటిష్ పాలకులు లక్షలాది టన్నుల ధాన్యాన్ని బ్రిటన్‌కు, వారు యుద్ధాలు చేస్తున్న ప్రాంతాలకు తరలించేవారని తెలిపారు. ఆకలితో అలమటిస్తూనే ప్రజలు బ్రిటిష్ పాలకుల కోసం ధాన్యం మోసేవారని, 150 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘోర ఘటనను గుర్తుచేసుకుంటూ ఒక మంచి కథను తెరకెక్కించామని చెప్పారు. ఆ కరువు కాలంలో ప్రాణాలు కోల్పోయిన ప్రజలకు నివాళిగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 30న రెండో ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్‌గాట్', అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్‌గాట్' స్ట్రీమింగ్‌కు రానున్నాయి. నాలుగో ఎపిసోడ్ 'ది లాస్ట్ లోడ్' స్ట్రీమింగ్ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.



## జైలర్–2లో మ్యూజిక్ మేనియా

కోలీవుడ్ అనే తేడా లేకుండా బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సూపర్‌స్టార్ రజనీకాంత్, సెన్సేషనల్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'జైలర్'కు సీక్వెల్‌గా 'జైలర్–2' రూపొందుతున్న విషయం తెలిసిందే. తొలి భాగం సంచలన విజయం సాధించడంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు సూరజ్, ఎస్.ఎస్. సూర్య, విద్యాబాలన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమాపై హైప్‌ను మరింత పెంచేలా రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ తనదైన శైలిలో హై–వోల్టేజ్ మాస్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా మేకర్స్ మరో క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. 'సంగీతపు సునామీ మిమ్మల్ని ముంచెత్తబోతోంది' అంటూ అనిరుధ్ మ్యూజిక్ మేనియాను పరిచయం చేస్తూ.. 'జైలర్–2'లోని 'రేవ్' పాటతో పాటు పూర్తి సంగీత ఆల్బమ్‌ను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో రజనీకాంత్ అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.



## ఈసారి అసలు వెనక్కి తగ్గేదే లేదు

విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట జంటగా నటించిన చిత్రం 'అనకాపల్లి'. ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన తన మిత్రుడు కాంద్రేగుల నాయుడుతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించిన ఈ సినిమాను తొలుత ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రకటించింది. అయితే కొన్ని అనివార్య కారణాలతో విడుదల వాయిదా పడింది. ఇలా ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు అక్టోబర్ 2న థియేటర్లలోకి రాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ప్రీ–రిలీజ్ వేడుకలో నిర్మాత, దర్శకుడు త్రినాథరావు నక్కిన సినిమా విడుదలపై స్పష్టతనిచ్చారు. 'మ్యూజిక్, ఫైట్లు, మాటలు అన్నీ ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయి. కాబట్టి తమ్ముళ్లు 100 శాతం సినిమా చూడండి. అక్టోబర్ 2న థియేటర్లలోకి రాబోతున్నది. అయితే ఈ సినిమా రెండుసార్లు వాయిదా పడటంతో నిజంగానే ఈసారి వస్తుందా? అంటూ చాలామంది నాకు సందేశాలు చేస్తున్నారు. ఇప్పుడు చెబుతున్నా.. ఈసారి వెనక్కి తగ్గేదే లేదు. కచ్చితంగా అక్టోబర్ 2న మీ ముందుకు వస్తున్నాం' అని త్రినాథరావు నక్కిన తెలిపారు. ఆయన వ్యాఖ్యలతో 'అనకాపల్లి' విడుదలపై నెలకొన్న సందేహాలకు తెరపడటంతో పాటు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది.

## 20 ఏళ్ల తర్వాత వెంకీ-త్రివిక్రమ్ జోడీ

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం'. శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్, డింపుల్ హయాతీ కథానాయికలుగా నటిస్తుండగా.. నారా రోహిత్, సత్య కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో పాటు యాక్షన్, వినోదం మేళవించిన ఈ చిత్రం అక్టోబర్ 9న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దీంతో చిత్రబృందం ప్రమోషన్స్‌లో జోరు పెంచింది. ఇందులో భాగంగా తాజాగా తొలి పాట 'నారాయణమ్మ'ను విడుదల చేశారు. ఈ పాట విడుదల కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేష్ సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంటూ భారీ హైప్ ఇచ్చారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి క్లాసిక్ ప్రేమకథల తర్వాత దాదాపు 20 ఏళ్లకు తాను, త్రివిక్రమ్ మరోసారి కలిసి పనిచేశామని తెలిపారు. ఈసారి ప్రేక్షకులు పూర్తిగా ఇష్టపడేలా యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్, సెంటిమెంట్ అన్నీ కలగలిసిన పర్ఫెక్ట్ కాంబినేషన్‌తో వస్తున్నామని చెప్పారు. ప్రేక్షకులు ఊహించని ఎన్నో ట్విస్టులు, టర్న్‌లు 'ఆదర్శ కుటుంబం'లో ఉంటాయని వెంకటేష్ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.

### నాగ్‌తో తలపడనున్న
## కోలీవుడ్ యంగ్ హీరో!



అక్కినేని నాగార్జున కెరీర్‌లో వందో చిత్రంగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక సినిమా 'కింగ్–100'పై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ ల్యాండ్‌మార్క్ చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు ర.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో నాగార్జునకు జోడీగా ప్రతిభావంతురాలైన నటి ఐశ్వర్య రాజేష్ కథానాయికగా నటిస్తుండగా.. టబు కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని క్రిస్మస్ పండగను పురస్కరించుకుని డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నాగార్జున కెరీర్‌లో వందో సినిమా కావడంతో 'కింగ్–100'కు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో నాగార్జునతో ఢీకొనే శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రలో కోలీవుడ్ యంగ్ హీరో అశోక్ సెల్వన్ నటించనున్నట్లు సమాచారం. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అశోక్ సెల్వన్ తొలిసారి నాగార్జునకు ప్రతినాయకుడిగా కనిపిస్తే తెరపై వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అశోక్ సెల్వన్ పాత్రపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే నాగార్జున వందో చిత్రంగా తెరకెక్కుతున్న 'కింగ్–100'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొనగా.. తాజాగా వినిపిస్తున్న విలన్ వార్తతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

## నానికి జోడీగా మీనాక్షి చౌదరి!

టాలీవుడ్ యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి అతి తక్కువ సమయంలోనే తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వరుస విజయాలను సొంతం చేసుకున్నారు. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఇండస్ట్రీలో లక్కీ చార్మ్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం యువ కథానాయకుడు నాగచైతన్యకు జోడీగా 'వృషకర్మ' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే వరుస అవకాశాలతో బిజీగా ఉన్న మీనాక్షి చౌదరి ఖాతాలో తాజాగా మరో భారీ ప్రాజెక్ట్ చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. నేచురల్ స్టార్ నాని, దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న హై–వోల్టేజ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ప్లడీ రోమియో'లో మీనాక్షి చౌదరిని కథానాయికగా ఎంపిక చేసినట్లు సమాచారం. యూకే ఫుడ్ మాఫియా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఇందులో ఆయన ఒకవైపు చెఫ్‌గా, మరోవైపు గ్యాంగ్‌స్టర్‌గా భిన్నమైన డబుల్ షేడ్స్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను మెప్పించనున్నట్లు సమాచారం. సుజీత్ తనదైన శైలిలో యాక్షన్, థ్రిల్, మాఫియా అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా అత్యంత కీలకమైన, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. నాని, పృథ్వీరాజ్ మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు నాని సరసన మీనాక్షి చౌదరి జోడీ కుదరడంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి, యునానిమస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రీ–ప్రొడక్షన్ పనులను పూర్తి చేసి ఈ ఏడాది అక్టోబర్ నుంచి 'ప్లడీ రోమియో' రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు విదేశీ నేపథ్యానికి సంబంధించిన కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. షూటింగ్‌తో పాటు నిర్మాణానంతర కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది వేసవి కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నాని, సుజీత్ కాంబినేషన్‌కు తోడు పృథ్వీరాజ్ సుకుమారన్, మీనాక్షి చౌదరి వంటి క్రేజీ నటీనటులు భాగం కావడంతో 'ప్లడీ రోమియో'పై ఇప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొంటున్నాయి.



## నెట్‌ఫ్లిక్స్‌లో చిరంజీవి 'చిరులీక్స్'

మెగా అభిమానులకు మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. మెగాస్టార్ చిరంజీవి జీవితంపై డాక్యుమెంటరీ రాబోతోందనే వార్తల నేపథ్యంలో.. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఆయన స్వయంగా తన అనుభవాలను పంచుకునే ప్రత్యేక పాడ్‌కాస్ట్ కార్యక్రమం రూపొందనున్నట్లు సమాచారం. దశాబ్దాలుగా సాగిన తన సినీ ప్రయాణం, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, మరచిపోలేని అనుభవాలను చిరంజీవి స్వయంగా ప్రేక్షకులతో పంచుకోనున్నారని తెలుస్తోంది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మించనున్నట్లు ఫిలిమ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తన వ్యక్తిగత, సినీ జీవితానికి సంబంధించిన అనేక ఆసక్తికర విషయాలను నేరుగా ప్రేక్షకులతో పంచుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఇన్నేళ్ల సినీ ప్రస్థానంలో తనకు ఎదురైన అనుభవాలు, చిత్ర పరిశ్రమలో చోటుచేసుకున్న మార్పులు, మారుతున్న పరిస్థితులపై తన అభిప్రాయాలు, తన ఆలోచనా విధానం వంటి విషయాలను కూడా చిరంజీవి ఇందులో వెల్లడించనున్నారట. ఇదిలా ఉండగా.. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో 'చిరులీక్స్' అనే హ్యాష్‌ట్యాగ్ బాగా ప్రాచుర్యం పొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే పేరును ఈ కార్యక్రమానికి పెట్టి.. వివిధ ప్రముఖ కుటుంబాలకు చెందిన సెలబ్రిటీలతో చిరంజీవి సరదాగా ముచ్చటిస్తూ, వారి గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకునేలా కార్యక్రమాన్ని రూపొందించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక వివరాలు ఇంకా వెలువడాల్సి ఉంది. త్వరలోనే నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.





## 16 ఏళ్లకే వైజాగ్ నుంచి రైలు ఎక్కా



అక్కినేని కోడలు, నటి శోభిత ధూళిపాళ్ల తన రెండో ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ సినీ ప్రయాణంలో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం పా.రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా 'వెట్టువం'లో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శోభిత తన గత ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే వైజాగ్ నుంచి బ్యాగ్ సర్దుకుని కోనార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కానని ఆమె తెలిపారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దామనే ఆలోచనతో, ఎదురయ్యే ప్రతి సవాల్‌ను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధపడి ఆ అడుగు వేశానని చెప్పారు. మోడలింగ్, నటనపై తనకున్న విపరీతమైన ఆసక్తే చిన్న వయసులోనే సొంతూరిని విడిచి వెళ్లేలా చేసిందని వెల్లడించారు. ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రులు అందించిన మద్దతును ఎప్పటికీ మరచిపోలేనని, వారు తనకు ఇచ్చిన స్వేచ్ఛ, ధైర్యమే తాను ఈ స్థాయికి చేరుకోవడానికి కారణమని పేర్కొన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుందని, అందరి గమ్యాలు ఒకేలా ఉండవని శోభిత అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి నిజాయితీగా తన ప్రయాణాన్ని కొనసాగించడమే తన దృష్టిలో నిజమైన విజయమని శోభిత ధూళిపాళ్ల పేర్కొన్నారు.

## నా చిన్ననాటి రాముడే కళ్లముందు నిలిచినట్లు అనిపించింది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ప్రతిభావంతుడైన దర్శకుడు నితేష్ తివారీ ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, వీఎఫ్ఎక్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయిపల్లవి, రావణాసురుడిగా కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్నారు. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, మండోదరిగా కాజల్ అగర్వాల్, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్నారు. రామాయణ ఇతిహాసాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో తొలి భాగాన్ని దీపావళి కానుకగా నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న సాయిపల్లవి చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తన మనసులో శ్రీరాముడి రూపం ఎలా ఉండేదో, ఆయన ముఖంలో కనిపించే అమాయకత్వం, ప్రశాంతత ఎలా ఉండేవో.. అవన్నీ రణబీర్ లుక్‌లో సరిగ్గా కనిపించాయని సాయిపల్లవి తెలిపారు. రణబీర్‌ను ఆ రూపంలో చూసిన క్షణంలో తన చిన్ననాటి ఊహల్లో ఉన్న శ్రీరాముడే నిజంగా తన కళ్లముందు వచ్చి నిలబడినట్లు అనిపించిందని ఆమె చెప్పుకొచ్చారు.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.